క్లుప్తంగా

నేడు సత్యదేవుని హుండీ లెక్కింపు



ఆలయం వద్ద ప్రధాన హుండీ

అన్నవరం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నారు. కార్తిక మాసంలో పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు భారీగా హుండీలలో కానుకలు సమర్పించే అవకాశం ఉంది. ఈ కారణంగా హుండీలు ఖాళీగా ఉంచేందుకుగాను లెక్కింపు నిర్వహిస్తున్నారు. ఈ నెలలో దసరా సెలవులు, వివాహాల సీజన్ కారణంగా పెద్ద సంఖ్యలో భక్తులు దేవస్థానానికి విచ్చేసి హుండీలలో కానుకలు సమర్పించారు. బుధవారం జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమానికి సిబ్బంది తప్పక హాజరవ్వాలని ఈఓ కే రామచంద్రమోహన్ ఆదేశించారు.

శెట్టి బలిజల అభివృద్ధికి తోడ్పాటు



దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రి వాసంశెట్టి సుభాష్

రౌతులపూడి: శెట్టి బలిజల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శెట్టి బలిజల అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడిన దొమ్మేటి వెంకటరెడ్డిని మరువరాదన్నారు. రౌతులపూడి మండలం ఎస్ఎస్ పట్నంలో మంగళవారం ఏర్పాటు చేసిన శెట్టి బలిజ జాతిపిత, బర్మా కేసరి, బర్మా మేయర్ అవార్డు గ్రహీత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందేళ్ల క్రితం జాతి కోసం పోరాడిన యోధుడు వెంకటరెడ్డి అని కొనియాడారు. ఆ రోజుల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో 50 వేల మందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి శెట్టి బలిజల సత్తా చాటిన ధీరుడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, విగ్రహ దాత చెల్లుబోయిన శ్రీనివాస్, స్థానిక టీడీపీ నేతలు లాలం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోత దశకు ఖరీఫ్ వరి



బెండపూడిలో కోత దశలో ఖరీఫ్ వరి చేలు

తొండంగి: మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఖరీఫ్ వరి పంట కోత దశలో ఉంది. పీబీసీ, పంపా, వ్యవసాయ బోర్ల పరిధిలో దాదాపుగా 16 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరిగింది. అధిక వర్షాలు, వరద ముంపులు, తెగుళ్ల సమస్యలను తట్టుకొని రైతన్నలు వరి పండించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తుపానుల బెడద తప్పినప్పటికీ అడపా దడపా మోస్తారుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు పనులు ముమ్మరంగా సాగనున్నాయి.

వరిలో తెగుళ్ల గుర్తింపు కీలకం

కోటనందూరు: వరిసాగులో తెగుళ్ల గుర్తింపు కీలకమని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. బొద్దవరం, టీజే నగరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వరిలో తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు తగిన మోతాదులో పురుగు మందులు వినియోగిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి, ఉద్యాన పంటలను పరిశీలించి ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఏఈఓ కేవీ శివకుమారి పాల్గొన్నారు.

రాణాసెంటర్ వంతెన నిర్మాణంపై దృష్టి

గోకవరం: గోకవరంలో రాణా సెంటర్‌లో నూతన వంతెన నిర్మాణానికి చర్యలు వేగవంతం చేసినట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం 516ఈ జాతీయ రహదారిలో గోకవరం రాణా సెంటర్ వద్ద నూతన వంతెన నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. దీనిపై అప్పట్లో పలువురు కోర్టును ఆశ్రయించగా వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. దీనిపై మంగళవారం ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి వంతెన నిర్మించే ప్రదేశాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కోర్టుని ఆశ్రయించిన వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజాభీష్టం మేరకు వంతెన నిర్మాణంలో మార్పులు చేసి అవసరమైతే సీఎం చంద్రబాబు దృష్టిలో పెట్టి కేంద్ర మంత్రిని కలిసి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.

వెలుగుల పండగకు వేళాయె!

- జోరుగా బాణ సంచా విక్రయాలు
- పరిమితంగా దుకాణాలకు అనుమతులు
- పేలుతున్న టపాసుల ధరలు
- గతేడాదితో పోల్చితే రెట్టింపు ధరలు



తుని రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల సముదాయం



దుకాణం వద్ద విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారి

తుని: వెలుగుల పండగకు సర్వం సిద్ధమైంది. చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా ఏటా దీపావళి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకుంటారు. సోమవారం నుంచి రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో మందుగుండు సామగ్రి అమ్మకాలు జరుగుతున్నాయి. గతేడాది కంటే బాణసంచా ధరలు రెట్టింపు కావడం వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. కాలుష్యం తక్కువ (పొగ) ఉండే సామాగ్రి అమ్మకాలు బాగున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. టపాసులను వినియోగించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి కె. రాముడు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

వంద గ్రామాలకు తుని ప్రధాన వాణిజ్య కూడలి. పండుగ సమయంలో అంతా తునిలోనే కొనుగోలు చేస్తారు. హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలకు తుని ప్రధాన కేంద్రం. ఏటా రూ.కోటికి పైగా టపాసుల వ్యాపారం జరుగుతుంది. ఈ సారి రూ.75 లక్షలు ఉంటుందని అంచనా. ఇక దీపావళికి రెండు రోజుల ముందు బాణసంచా అమ్ముకోవడానికి తాత్కాలిక లైసెన్స్‌లు జారీ చేసే అధికారం పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులకు ఉంది.

నియోజకవర్గం	ధరఖాస్తుల సంఖ్య	జారీ చేసిన దుకాణాలు	వ్యాపారం రూ.కోట్లలో
తుని	120	100	1.25
ప్రత్తిపాడు	60	50	1 కోటి
జగ్గంపేట	55	45	1 కోటి

ప్రభుత్వం నిర్దేశించిన రుసుము అగ్నిమాపక, రెవెన్యూ శాఖలకు కలిపి రూ.1000లు చలానా రూపంలో చెల్లిస్తే సరిపోతుంది. దీనికి ఎవరైనా ధరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా తునిలో అధికారులకు వచ్చిన ధరఖాస్తులు 100 వరకు ఉన్నాయి. వీటికి మాత్రమే తాత్కాలిక లైసెన్స్ ఇచ్చారు.

నిబంధనలు పాటించాలి

దీపావళి సామాగ్రి అమ్మకాలు చేసే ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అగ్నిమాపక శాఖ అధికారులు దుకాణాలు ఉన్న ప్రాంతంలో ఇసుక, నీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం దుకాణాలకు మధ్య స్థలం ఉండాలి. దుకాణాల యాజమానులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేలుతున్న టపాసుల ధరలు

దీపావళి పండుగ వస్తే చాలు జేబు ఖాళీ అవుతుంది. గతేడాది నలుగురు కుటుంబ సభ్యులు ఉంటే రూ. 2500లు మందుగుండు సామాగ్రికి ఖర్చు చేశాం. ఈ ఏడాది అవే సామగ్రికి జీఎస్టీతో కలిపి రూ.4,500లు అయ్యింది.

–ఎం.సుధాకర్, ఉద్యోగి, తుని.

అదనంగా వసూలు చేస్తే చర్యలు

దీపావళి సామాగ్రికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చలానా కట్టించాం. అనధికారిక వసూళ్లు చేసినట్టు ఫిర్యాదులు వస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే అమ్మకాలు చేయాలి. రక్షణ చర్యలు విధిగా పాటించాలి. అనుమతులు లేకుండా అమ్మకాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం.

–ప్రసాద్, తహసీల్దార్, తుని.

అనుమతులు లేకుండా అమ్మకాలు వద్దు



బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

జగ్గంపేట: బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ జేవీఆర్ రమేష్ తెలిపారు. జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలను ఆయన పరిశీలించారు. అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారని, రేకుల షెడ్లు లేవని పలువురు ఆరోపించడంతో ఆయన తనిఖీలు నిర్వహించారు. జగ్గంపేట మండలానికి గాను జగ్గంపేటలో 11 దుకాణాలకు, కాట్రావులపల్లిలో 2 దుకాణాలకు ధరఖాస్తులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో మండల అగ్నిమాపక అధికారి ఎస్.లక్ష్మణరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గోకవరం: మండలంలోని కామరాజు పేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరీ దేవి తెలిపారు. పాఠశాల నుంచి త్రో బాల్ పోటీలకు తొమ్మిదో తరగతికి చెందిన జి.నందిని, కె.సత్య తేజస్విని, ఏడో తరగతికి చెందిన ఎస్.పూజ ఐశ్వర్య, పదో తరగతికి చెందిన డి.ధనలక్ష్మిలు ఎంపికయ్యారన్నారు. వీరు వచ్చే నెల 7న అనపర్తిలో జరగే త్రో బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని సర్పంచ్ అడపా వెంకట్రావు, పాఠశాల కమిటీ చైర్మన్ రాధాకృష్ణ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుక



ఆయుర్వేద ప్రముఖులకు సత్కారం

తుని: శ్రీ ప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ధన్వంతరి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీ ప్రకాష్ ఆయుష్ చారిటబుల్ రిసెర్చ్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సీహెచ్.నరసింహారావు, రామసీత దంపతులు ధన్వంతరి హోమం నిర్వహించారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఏటా హోమం నిర్వహిస్తున్నామని నరసింహారావు తెలిపారు. ఆయుర్వేద చికిత్సలో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ఘనంగా సత్కరించారు. ఆయుర్వేద వైద్యం వలన కలిగే ప్రయోజనాలను సన్మాన గ్రహీతలు వివరించారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సమీరా, డాక్టర్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఆయుర్వేద చికిత్సాలయం వైద్యులు రమేష్ బాబు, సిబ్బంది, తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

కోటి బిల్వార్చనకు ముమ్మర ఏర్పాట్లు

- హాజరు కానున్న శబరిమలై సన్నిధాన ప్రముఖులు
- నవంబర్4న నిర్వహణ



మాట్లాడుతున్న కమిటీ నిర్వాహకుడు చంటి స్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ప్రత్తిపాడు–రాచపల్లి అడ్డు రోడ్డు మార్గంలో గల వడాల గోపాల కృష్ణా రెడ్డి ప్రాంగణంలో నవంబర్ 4న అయ్యప్ప స్వామి భక్తులతో కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవ వేడుకలను అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కమిటీ సభ్యుడు చంటి గురుస్వామి మాట్లాడుతూ 25 వేల మంది అయ్యప్ప స్వామి భక్తులతో కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ గణపతి హోమం, చండీహోమం, పూర్ణాహుతి, దంపాణి గురువర్యుల గురు పూజోత్సవం, అష్టాదశ కలశాలతో అయ్యప్పస్వామి ఊరేగింపు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శబరిమలై సన్నిధానం నుంచి పందల రాజ్య వంశీకులు, శబరిమలై అర్చకుడు మేల్ శాంతి వంటి ప్రముఖులు హాజరవుతారన్నారు. ప్రత్తిపాడు పరిసర మండలాలకు చెందిన భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతి నియంత్రణకు కృషి చేద్దాం



సూరంపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పవర్ గ్రిడ్ ఉద్యోగులు

గండేపల్లి: అవినీతి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పవర్‌గ్రిడ్ డీజీఎం పవన్ కుమార్ అన్నారు. మండలంలోని సూరంపాలెంలో గల పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2024' పురస్కరించుకొని పవర్ గ్రిడ్ ఉద్యోగులు వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలంతా అవినీతికి వ్యతిరేకంగా పోరాడి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. పలు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ మేనేజర్లు కోటేశ్వరరావు, వీరేంద్ర, మహేష్, మూర్తి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గంగాధర్

ప్రత్తిపాడు: ప్రతి రైతు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి యింటి వీర గంగాధర్ తెలిపారు. మండలంలోని లంపకలోవ గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారి యింటి వీర గంగాధర్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగించాలన్నారు. సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేస్తే ఎకరానికి సుమారు రూ.లక్ష ఆదాయం పొందవచ్చన్నారు. సాగులో వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్తి వ్యవసాయ శాఖ మండల స్థాయి అధికారి మూరా చినబాబు, వ్యవసాయ సహాయకుడు కృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ పోతురాజు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు స్పందన కరవు



గ్రామాల్లో జరిగిన పనులను సభలో వెల్లడిస్తున్న ఉపాధి సిబ్బంది

కిర్లంపూడి: సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ప్రజలు లేకుండానే రూ. 9.83 కోట్ల పనులకు చెందిన తనిఖీలను ముగించేశారు. ప్రజా వేదిక వద్ద ఉపాధి కూలీలు, రైతులు లేకపోవడంతో సిబ్బంది తీరును ప్రశ్నించే గొంతుకలు లేక ఏకపక్షంగా ముగిసింది. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ బి.హరికృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ తోట రవి పాల్గొన్నారు. డ్వామా పీడీ అడపా వెంకట లక్ష్మి సమక్షంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్ ద్వారా రూ. 9.83 కోట్లతో చేపట్టిన పనులను డీఆర్పీలు చదివి వినిపించారు. మస్టర్ల దిద్దుబాటు, చేసిన పనులకు ఎక్కువ బిల్లులు పెట్టడం, సమాచార బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలపై ఉపాధి సిబ్బంది నుంచి రికవరీ చేయాలని అధికారుల ఆదేశాలిచ్చారు. సమాచార బోర్డుల ఏర్పాటుకు కేటాయించిన రూ.41 వేలు తిరిగి చెల్లించాలని లేదా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మేట్ల నిర్లక్ష్యం వల్ల ప్రతి ఒక్కరికీ పని కల్పించలేకపోతున్నారని వారిని మార్చాలంటూ పలువురు ఉపాధి కూలీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, ఏపీఓ ఏవీబీ నాయుడు, ఎమ్.భాను ప్రకాష్, ఎస్సార్పీ పి.సింహాద్రి ఉన్నారు.

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు

ఏలేశ్వరం: నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ తీరుపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడంపై వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు అజెండాలోని తీర్మానాలకు అమోదం తెలపలేదు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అజెండాలోని తీర్మానాలను చదవి వినిపించారు. వైఎస్సార్ సీపీకి చెందిన 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు మాట్లాడుతూ.. కమిషనర్ ప్రోటోకాల్ ప్రకారం వార్డుల్లో పర్యటించేటప్పుడు కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సిలర్లను పట్టించుకోకుండా దళారులతో వార్డుల్లో పర్యటించడం సరికాదన్నారు. ఆయన తీరుకు నిరసనగా అజెండాలోని తీర్మానాలను వ్యతిరేకించడంతో పాటు అమోదించడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ సామంతుల హైమావతి మాట్లాడుతూ తమ వార్డులో ఇళ్లవద్ద మద్యం దుకాణం ఏర్పాటు విరమించుకోలన్నారు. మద్యం దుకాణం వద్దని మహిళలు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్న అధికారులు స్పందించడం లేదన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



ధర్మరాజు మృతదేహం

గండేపల్లి: మండలంలోని మురారిలో చెరువులో పడి వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు. గ్రామానికి చెందిన ఐనపాల ధర్మరాజు సోమవారం రాత్రి గ్రామ శివారులోని పెద్ద చెరువు సమీపంలో గల పుష్కర కాలువ అక్విటెడ్ సైడ్ వాల్ మీదుగా నడుచుకుంటూ పొలానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడిపోయాడు. అప్పటి నుంచి అతని కోసం గాలింపు చేపట్టగా మంగళవారం ఉదయం మృతదేహం లభించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పత్తి సాగుపై అవగాహన

శంఖవరం: పత్తి సాగులో గులాబీ రంగు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మంగళవారం మండలంలోని మాసంపల్లి, జగన్నాధపురం గ్రామాల్లో పత్తి రైతులతో కలిసి పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంట వేసిన 45 రోజుల్లో గులాబీ రంగు పురుగు పువ్వులలో పుప్పొడిని నాశనం చేయడం ద్వారా అధిక దిగుబడి రాదన్నారు. ఇలాంటి పువ్వులను తీసివేయాలన్నారు. గులాబీ రంగు పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలను అమర్చాలన్నారు. ఉద్యాన సహాయకులు సువర్ణరాజు, రైతులు పాల్గొన్నారు.

లింగంపర్తిలో ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలోని సారా స్థావరాలపై మంగళవారం విస్తృత దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి శివ ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ కృష్ణకుమారి ఆదేశాల మేరకు ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై పి వంశీరామ్ సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

భూగర్భ జలాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి
- ఎస్పీ నరసింహ కిశోర్‌తో గుమ్మళ్లదొడ్డిలో పర్యటన



గుమ్మళ్లదొడ్డిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, పక్కన ఎస్పీ నరసింహ కిశోర్

గోకవరం: అస్సాగో ఇథనాయిల్ పరిశ్రమ వలన భవిష్యత్తులో భూగర్భ జలాలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ సమన్వయ శాఖల అధికారులతో పర్యటించి గ్రామస్తులతో భేటీ అయ్యారు. ఇక్కడి వాస్తవ స్థితిగతులపై ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ అస్సాగో ఇథనాయిల్ పరిశ్రమను గ్రామస్తుల సమక్షంలో ప్రతిరోజు సందర్శించాలని అక్కడి పరిస్థితులను వారికి అర్థమయ్యే విధంగా విశదీకరించాలన్నారు. ఈ విషయంలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూగర్భ జలాల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చేపట్టే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమకు అవసరమైన జలాలను గోదావరి నది నుంచి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంత రైతులకు సాగు విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూగర్భ జలాలను పరిరక్షించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, అస్సాగో ఇథనాయిల్ పరిశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో లబ్ధిదారులకు మేలు



యర్రవరం శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న కొల్లా శ్రీనివాస్

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకంతో లబ్ధిదారులకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని యర్రవరం గ్రామంలో మంగళవారం పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. చేతి వృత్తుల వారికి చేయూతనిచ్చేందుకు ప్రారంభించారన్నారు. వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరికరాలు, రోజువారి అలవెన్సు, సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ద్వారా బ్యాంక్ రుణాలు పొందవచ్చునన్నారు. అమూల్య, అశిష్ శిక్షణ తరగతులు నిర్వహించారు.

తూర్పు లక్ష్మీపురంలో పీఎం విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కురాకుల రాజా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకుడు పతివాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెరిగిన తుప్పలతో తిప్పలు



ఎస్.తిమ్మాపురం సమీపంలో రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు

కిర్లంపూడి: చిల్లంగి – తామరాడ రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని సమీప ప్రాంతాల ప్రయాణికులు వాపోతున్నారు. గెద్దనాపల్లి, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయుని పాలెం, తామరాడ గ్రామాల పరిధిలో సుమారు పదకొండు కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా దట్టంగా తుప్పలు పెరిగాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువ కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచు ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనచోదకులు చెబుతున్నారు. తుప్పలను తొలగించేలా ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అలరించిన వీధి నాటకం



'వాలి–సుగ్రీవుల యుద్ధం' వీధి నాటకంలో ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీ గౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాకారులు నిర్వహించిన 'వాలి–సుగ్రీవుల యుద్ధం' వీధి నాటకం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావు పేట, మంగయ్యమ్మ పేట, సినిమా హాలు సెంటర్లలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. నాటకంలో సుగ్రీవునిగా మడబాల బాబ్జీ, వాలిగా పంపన బోయిన మణికంఠ, ఆంజనేయుడిగా గొనగాని శ్రీనివాస్, రాముడిగా కొనిబొయిన రాజు లక్ష్మణుడిగా గాకిల్లాడి రాజేష్, తారగా కొనిబొయిన విష్ణువర్ధన్, జాంబవంతుడిగా అమరపల్లి బాలు నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీనులు మేకప్–డ్రెస్సింగ్ చేశారు.